# మంత్రిగా ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారా?

- **ఉదయనిధికి సుప్రీం మందలింపు**
- **'సనాతన ధర్మం' వ్యాఖ్యలపై గుస్సా**

న్యూఢిల్లీ: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు యువజన సంక్షేమ, క్రీడల శాఖ మంత్రి, సినీ నటుడు ఉదయనిధి స్టాలిన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తీవ్రంగా మందలించింది. వాక్ స్వాతంత్ర్యాన్ని, భావప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చేశారని ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తనపై నమోదైన అన్ని కేసులను కలిపి విచారించాలంటూ ఎందుకు పిటిషన్ వేశారని ప్రశ్నించింది. ఇలాంటి వ్యాఖ్యలు చేసే ముందు జాగ్రత్తగా వ్యవహరించాలని, మంత్రిగా ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఎలాంటి పరిణామాలు తలెత్తుతాయో ఆలోచించాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం హెచ్చరించింది. 'రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను మీరు దుర్వినియోగం చేశారు. ఇప్పుడు నేరుగా సుప్రీం కోర్టులో పిటిషన్ వేసేందుకు ఆర్టికల్ 32 ద్వారా లభించిన హక్కును ఉపయోగించుకుంటున్నారా? మీరేమీ సాధారణ వ్యక్తి కాదు. ప్రస్తుతం మీరొక మంత్రిగా ఉన్నారన్న విషయాన్ని గుర్తుపెట్టుకోండి. మీ వ్యాఖ్యల వల్ల తలెత్తే పర్యవసానాలు ఏమిటో మీకు తెలియదా?' అంటూ ధర్మాసనం నిలదీసింది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కుమారుడైన ఉదయనిధి స్టాలిన్ గతేడాది సెప్టెంబర్‌లో ఓ సమావేశంలో మాట్లాడుతూ.. సనాతన ధర్మం కరోనా వైరస్, మలేరియా, డెంగ్యూ లాంటిదని.. సామాజిక న్యాయానికి, సమానత్వానికి విరుద్ధమైనదని.. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే. దీంతో ఆయనపై వివిధ రాష్ట్రాల్లో పలు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఉదయనిధి వ్యాఖ్యలను తాను సమర్థించడం లేదని, ఆయనపై నమోదైన అన్ని కేసులను కలిపి విచారించాలని మాత్రమే కోరుతున్నానని ఆయన న్యాయవాది అభిషేక్ సింఘ్వీ సుప్రీం కోర్టును కోరారు.



# జూన్ 15లోగా ఖాళీ చేయండి

- **ఆప్ ప్రధాన కార్యాలయాన్ని ఖాళీ చేయాలని సుప్రీం ఆదేశాలు**
- **ఢిల్లీ హైకోర్టు స్థలాన్ని ఆక్రమించారని ఆగ్రహం**

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. న్యూఢిల్లీలోని రౌస్ అవెన్యూలో ఏర్పాటుచేసిన పార్టీ కార్యాలయాన్ని జూన్ 15వ తేదీలోగా ఖాళీ చేయాలని ఆప్‌ను సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. 'ఆ స్థలాన్ని ఓ రాజకీయ పార్టీ ఎలా తీసుకుంటుంది? అక్కడ అన్ని రకాల ఆక్రమణల్ని తొలగించాల్సిందే' అని సీజేఐ డీవై చంద్రచూడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ప్రదేశాన్ని ఢిల్లీ హైకోర్టు విస్తరణకు కేటాయించినట్టుగా గుర్తించిన సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు జారీచేసింది. ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాల్సిందిగా ల్యాండ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీస్‌కు ఆప్ దరఖాస్తు చేసుకోవాలని కోర్టు సూచించింది. ప్రస్తుతం పార్టీ కార్యాలయం ఏర్పాటుచేసిన స్థలంలో కొనసాగే హక్కు 'ఆప్'కు లేదని ధర్మాసనం పేర్కొన్నది. ఆప్ భూ ఆక్రమణకు పాల్పడిందని, చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోలేరని స్పష్టం చేసింది.



### 12 తర్వాత వర్చువల్‌గా విచారణకు హాజరవుతా!

మద్యం పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణకు ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఎనిమిదోసారి గైర్హాజరయ్యారు. అయితే విచారణకు తాను సంసిద్ధంగానే ఉన్నానని, మార్చి 12న తర్వాత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతానని ఈడీ అధికారులకు రాసిన లేఖలో కేజ్రీవాల్ పేర్కొన్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

**లంచం కేసుల్లో ఎంపీ, ఎమ్మెల్యేలకు**

# మినహాయింపు లేదు

మొదటిపేజీ తరువాయి...

(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఏఎస్ బోపన్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పు వెలువరించింది. 1998 నాటి పీవీ నరసింహారావు సర్కారు వర్సెస్ సీబీఐ కేసు తీర్పును న్యాయస్థానం కొట్టివేసింది.

### కేసు విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

- లంచాలు తీసుకొని పార్లమెంట్, అసెంబ్లీలో సభ్యులు ప్రశ్నలు అడిగినా, ప్రసంగాలు చేసినా, డబ్బు తీసుకొని ఓట్లు వేసినా విచారణ ఎదుర్కోవాల్సిందే. అలాంటి వారికి రాజ్యాంగ రక్షణ ఎందుకు కల్పించాలి?
- ప్రజాప్రతినిధులు అవినీతికి పాల్పడటం, లంచాలు తీసుకోవడం పార్లమెంట్ వ్యవస్థ పనితీరును నాశనం చేస్తుంది.
- డబ్బులు తీసుకొని చట్టసభ సభ్యులు ఓటేయడమంటే, భారత ప్రజాస్వామ్య పునాదులను శిథిలం చేయడమే.
- లంచాల కేసుల్లో చట్టసభ సభ్యులకు మినహాయింపు లేదు. ఇలాంటి అవినీతికి పార్లమెంటరీ అధికారాల ద్వారా రక్షణ ఉండబోదు. అవినీతికి పాల్పడినవారు విచారణ ఎదుర్కోవాల్సిందే.
- లంచం తీసుకోవడం అనే ఆరోపణలు ప్రజా జీవితంలో చట్టసభసభ్యుల విశ్వసనీయతను దెబ్బతీస్తాయి.
- 1998లో పీవీ సర్కారు వర్సెస్ సీబీఐ కేసులో ఇచ్చిన తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్ 105, 194లోని వివరణలకు విరుద్ధంగా ఉన్నది. లంచం తీసుకొన్న చట్టసభ సభ్యుడిని కాపాడే విధంగా ఉన్న ఆ తీర్పును పాటించలేము.
- అనుకూలంగా ఓటేశారా? అనుకూలంగా ప్రసంగించారా? లేదా?? అనేది తర్వాత.. ముందు లంచం తీసుకొన్నారా? లేదా? అనేదే ముఖ్యం. లంచం తీసుకొంటే నేరం చేసినట్టే. డబ్బులు తీసుకొన్నప్పటికీ, 'అనుకూలంగా ఓటేయలేదు? ప్రసంగించలేదు' అని ఎవరైనా సర్దిచెప్పుకొన్నా సరే.. తప్పు.. తప్పుకాకుండా పోదు.
- ఓటు కోసం లంచం తీసుకొన్న చట్టసభ సభ్యుడు అవినీతి నిరోధక చట్టం కింద విచారణను ఎదుర్కోవాల్సిందే.



### ఏమిటీ కేసు?

జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) ఎమ్మెల్యే సీతా సొరేన్ 2012 రాజ్యసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థికి ఓటు వేయడానికి లంచం తీసుకొని మరొకరికి ఓటు వేశారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆమె తొలుత జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. ఆమె అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించడంతో సుప్రీంకు వెళ్లారు.

### ఇద్దరి నుంచి చివరకు ఏడుగురికి..

చట్టసభల్లో ప్రజాప్రతినిధుల లంచాల అంశం ఎంతో సంక్లిష్టమైంది. దీనిపై తీర్పును వెలువరించడానికి ఏకంగా నాలుగు సార్లు సుప్రీంకోర్టు ప్రత్యేక రాజ్యాంగ ధర్మాసనాలను ఏర్పాటు చేయవలసివచ్చింది. సీతా సొరేన్ కేసును హైకోర్టు తిరస్కరించడంతో ఆమె విజ్ఞప్తి మేరకు ఇద్దరు సభ్యుల సుప్రీం ధర్మాసనం 2014లో విచారణ జరిపింది. అయితే, కేసు ప్రాముఖ్యం దృష్ట్యా దీన్ని త్రిసభ్య ధర్మాసనానికి సిఫారసు చేసింది. దీంతో 2019లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఏర్పాటైంది. చివరకు ఈ కేసును ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి సిఫారసు చేశారు. అనంతరం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఈ సందర్భంగా 1998నాటి పీవీ నరసింహారావు సర్కారు వర్సెస్ సీబీఐ కేసులో ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో ఏడుగురు సభ్యుల విస్తృత ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. విస్తృత ధర్మాసనం విచారణ జరిపి తాజాగా తీర్పు వెలువరించింది.

### 1998 నాటి కేసులో ఏం జరిగింది?

1993లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రభుత్వం అవిశ్వాసాన్ని ఎదుర్కొంది. ఆ సమయంలో జేఎంఎం ఎంపీగా ఉన్న శిబు సొరేన్ సహా అదే పార్టీకి చెందిన మరో ఐదుగురు ఎంపీలు లంచాలు తీసుకుని పీవీ సర్కారుకు అనుకూలంగా ఓటు వేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వీరి మద్దతుతో మైనార్టీలో ఉన్నప్పటికీ 265 ఓట్లతో పీవీ ప్రభుత్వం గట్టెక్కింది. అయితే, జేఎంఎం ఎంపీలు లంచాలు తీసుకొన్నారన్న వ్యవహారం దుమారం రేపడంతో సీబీఐ కేసు నమోదు చేసింది. అయితే, సొరేన్ బృందానికి ఊరట కలిగించేలా సుప్రీం కోర్టు 1998లో తీర్పును వెలువరించింది. ప్రజాప్రతినిధులకు లంచం కేసుల విచారణ నుంచి మినహాయింపు ఇస్తున్నట్టు పేర్కొన్న ధర్మాసనం ఆ కేసును కొట్టేసింది.

### గొప్ప తీర్పు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, మార్చి 4: జేఎంఎం అవినీతి కేసులో సుప్రీంకోర్టు తీర్పు చాలా గొప్పగా ఉందని ప్రధాని మోదీ కొనియాడారు. స్వచ్ఛమైన రాజకీయాల్ని పెంపొందిస్తుందని, రాజకీయ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పెంచుతుందని ప్రధాని అన్నారు. లంచం కేసుల్లో చట్ట సభ్యులకు ఎలాంటి మినహాయింపు లేదని సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పు వెలువరించింది. తీర్పును ఆహ్వానిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. చట్టాన్ని సరిదిద్దటం కోరదగినదని, న్యాయ వ్యవస్థ ఈ పని ఎప్పుడో చేయాల్సిందని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వి ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఒక సింపుల్ పాయింట్ చాలా ఏండ్లుగా పెండింగ్‌లో ఉండిపోయింది. న్యాయ వ్యవస్థ నేడు దానికి ముగింపు పలికింది' అని అన్నారు.

### సుప్రీం తాజా తీర్పుతో ఏం జరుగనున్నది?

చట్టసభ సభ్యులకు సంబంధించి ఓటుకు నోటు కేసులు పారదర్శక ఎన్నికల ప్రక్రియకు ఓ విఘాతంలా మారాయి. సుప్రీం తీర్పు రాక ముందు లంచం కేసుల్లో చట్టసభ సభ్యులను విచారించే అవకాశం ఉండేది కాదు. అయితే, రాజ్యాంగపరంగా వారికి ఉన్న రక్షణను కోర్టు తాజాగా తొలగించడంతో.. ఓటు కోసం లేదా ప్రశ్నలు వేయడానికి లేదా ప్రసంగించడానికి లంచం తీసుకొన్న చట్టసభసభ్యుడు అవినీతి నిరోధక చట్టం కింద విచారణను ఎదుర్కోవాల్సిందే.



## ఇస్రో చైర్మన్‌కు క్యాన్సర్

**ఆదిత్య ఎల్ 1 ప్రయోగం రోజే నిర్ధారణ**
**వ్యాధి నుంచి కోలుకున్న సోమ్‌నాథ్**

న్యూఢిల్లీ, మార్చి 4: భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చీఫ్ సోమనాథ్ క్యాన్సర్ బారినపడ్డారు. టార్మాక్ మీడియా హౌస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. సూర్యుడిపై ప్రయోగాలకు ఉద్దేశించిన ఆదిత్య ఎల్-1 ప్రయోగం రోజే తనకు క్యాన్సర్ నిర్ధారణ అయినట్టు తెలిపారు. చంద్రయాన్-3 లాంచింగ్ సమయంలోనే తనకు కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తాయని, అయితే దానిపై అప్పట్లో అంత స్పష్టత లేదని పేర్కొన్నారు. చంద్రయాన్-3 చంద్రుడి దక్షిణ ధృవంపై విజయవంతంగా కాలుమోపిన కొన్ని వారాల తర్వాత అంటే 2023 సెప్టెంబర్ 2న ఆదిత్య ఎల్-1ను ప్రయోగించారు. ఆ తర్వాత ఆయన ఆపరేషన్ చేయించుకున్నారు. అనంతరం కీమోథెరపీ ప్రారంభమైంది. తనకు క్యాన్సర్ సోకిన విషయం తెలిసి కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతికి గురయ్యారని సోమనాథ్ చెప్పారు. క్యాన్సర్‌కు పరిష్కారంగా చికిత్స ఉందన్న విషయం ఇప్పుడు తనకు అర్థమైందన్నారు. క్యాన్సర్ ఆయనకు వంశపారంపర్యంగా వచ్చినట్టు తెలిసింది. క్యాన్సర్‌తో పోరాడి కోలుకున్న నాలుగు రోజుల తర్వాత ఆయనీ విషయాన్ని బయటపెట్టారు. ఐదో రోజే విధుల్లో చేరారు. ప్రస్తుతం తాను పూర్తిగా కోలుకున్నానని, విధులు నిర్వర్తిస్తున్నట్టు సోమనాథ్ తెలిపారు.

## గుజరాత్ కాంగ్రెస్‌లో సంక్షోభం

**వర్కింగ్ ప్రెసిడెంట్ రాజీనామా**

అహ్మదాబాద్, మార్చి 4: సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడిన వేళ గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీలో అత్యంత సీనియర్, 40 ఏండ్లుగా పార్టీలో కొనసాగిన ముఖ్య నేత, ఎమ్మెల్యే అర్జున్ మోద్వాడియా(67), పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంబరిష్ డెర్ కాంగ్రెస్‌ను వీడారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నామని సోమవారం ప్రకటించారు. జనవరిలో జరిగిన అయోధ్య రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ బాయ్‌కాట్ చేయటాన్ని నిరసిస్తూ పార్టీని వీడుతున్నామని వారు తెలిపారు. రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర' మరికొద్ది రోజుల్లో గుజరాత్‌లో ప్రవేశిస్తుందనగా, ఆ రాష్ట్ర కాంగ్రెస్‌లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. తాను బీజేపీలో చేరుతున్నట్టు అంబరిష్ డెర్ ప్రకటించారు. కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు, మాజీ కేంద్ర మంత్రి నారన్ రాథ్వా పార్టీని వీడి బీజేపీలో చేరారు. గత నాలుగు నెలల్లో కాంగ్రెస్ పార్టీకి ముగ్గురు ఎమ్మెల్యేలు రాజీనామా చేయటం గమనార్హం. దీంతో ఆ రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 14కు పడిపోయింది.

## 13న ఎన్నికల షెడ్యూల్?!

**మోదీ పర్యటన ముగియగానే ప్రకటన! • ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేసిన ఈసీ**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ 13న ప్రకటించే సూచనలు కనిపిస్తున్నాయి. రానున్న 10 రోజుల్లో 12 రాష్ట్రాలు, యూటీల్లో ప్రధాని నరేంద్రమోదీ పర్యటించనున్నారు. 29కి పైగా సభల్లో ప్రసంగించనున్నారు. ఈ సభలు 13నే ముగియనున్నాయి. మోదీ సభలు ముగిసిన రోజునే ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడవచ్చని సోషల్‌మీడియాలో పెద్దయెత్తున చర్చ జరుగుతున్నది. లోక్‌సభతో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేశామని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఇదివరకే ప్రకటించింది. అయినప్పటికీ, షెడ్యూల్ ప్రకటనపై ఇంకా ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. దీంతో మోదీ పర్యటన కోసమే షెడ్యూల్‌ను నిలుపుదల చేశారంటూ సోషల్‌మీడియాలో పలువురు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. కాగా 2019లో లోక్‌సభ ఎన్నికలకు మార్చి 10న షెడ్యూల్ ప్రకటించిన ఈసీ.. ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకు మొత్తం ఏడు దఫాల్లో పోలింగ్ నిర్వహించింది. మే 23న ఫలితాలు ప్రకటించింది.

## మేమంతా మోదీ కుటుంబమే!

**లాలూ వ్యాఖ్యలకు బీజేపీ కౌంటర్**

న్యూఢిల్లీ: ప్రధాని మోదీకి కుటుంబమే లేదంటూ ఆదివారం పాట్నాలో జరిగిన ర్యాలీ సందర్భంగా ఆర్జేడీ చీఫ్, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో పలువురు బీజేపీ నేతలు సోమవారం మోదీకి మద్దతుగా నిలిచారు. తమ సోషల్ మీడియా ఖాతాల ప్రొఫైల్స్‌లలో తమ పేర్లకు 'మోదీ కా పరివార్(మోదీ కుటుంబసభ్యులం)' అంటూ జోడింపు చేశారు. దేశవ్యాప్తంగా చాలా మంది పార్టీ నేతలు, కార్యకర్తలతోపాటు కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు తమ సోషల్ మీడియా ఖాతాల్లో ఈ మేరకు ప్రకటించుకొన్నారు.

## మోదీ నన్ను క్షమించలేదు: ప్రజ్ఞా ఠాకూర్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు తనకు టికెట్ నిరాకరించడంపై బీజేపీ ఎంపీ సాధ్వీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ స్పందించారు. నాథూరాం గాడ్సేను పొగుడుతూ గతంలో తాను చేసిన వ్యాఖ్యలు ప్రధానికి నచ్చలేదని, టికెట్ నిరాకరించడం ద్వారా తనను ఆయన క్షమించలేదని స్పష్టమవుతున్నదని ఆమె పేర్కొన్నారు. 195 మంది అభ్యర్థులతో బీజేపీ ఇటీవలే మొదటి జాబితాను ప్రకటించింది. ఇందులో సుమారు 33 మంది సిట్టింగ్‌లకు అవకాశం రాలేదు. వారిలో ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ ఒకరు.

**నిర్దోషినని నిరూపించుకున్నాకే**

## పోటీ చేస్తా!

**బీజేపీ ఎంపీ అభ్యర్థి ఉపేంద్ర సింగ్ రావత్**

న్యూఢిల్లీ:యూపీలోని బారాబంకి అభ్యర్థిగా బీజేపీ ప్రకటించిన ఉపేంద్ర సింగ్ రావత్‌కి అనుకోని కష్టం వచ్చిపడింది. పార్టీ ఇలా టికెట్ ప్రకటించిందో లేదో.. ఆ మరుసటి రోజే అతను వివాదంలో ఇరుక్కున్నారు. అతనికి సంబంధించిన ఓ అశ్లీల వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. దీంతో ఒక్కసారిగా కలకలం రేగింది. దీనిపై స్పందించిన రావత్.. తన నిర్దోషిత్వం నిరూపించుకునేంత వరకు తాను ఎన్నికల్లో పోటీ చేయనని ప్రతిజ్ఞ చేశారు. ఆ వీడియోపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆ వీడియో డీప్‌ఫేక్ అని కొట్టిపారేశారు. ఏఐ ఉపయోగించి నకిలీ వీడియో రూపొందించారని ఆరోపించారు.

# విపక్షాలు వెళ్లిపోకుండా తాళమేయండి!

- **స్పీకర్‌కు తాళం, చెవి అందించిన పంజాబ్ సీఎం**
- **అసెంబ్లీలో కాంగ్రెస్, ఆప్ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం**

చండీగఢ్, మార్చి 4: పంజాబ్ అసెంబ్లీలో సోమవారం అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ప్రతిపక్షాలు వాకౌట్ చేయటానికి వీల్లేకుండా సభకు తాళం వేయాలని తాళంతో పాటు తాళం చెవి ఉన్న కవర్‌ను స్పీకర్‌కు పంజాబ్ సీఎం భగవంత్ మాన్ అందచేశారు. దీంతో సభలో ఒక్కసారిగా గందరగోళం రేగింది. పంజాబ్ అసెంబ్లీలో బడ్జెట్ సెషన్ రెండో రోజైన మార్చి 1న గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్నందుకు ప్రతిపక్ష కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పంజాబ్ సీఎం మాన్ నిందించారు. దీనిపై చర్చకు సభలో డిమాండ్ చేశారు. ఆప్ ఎమ్మెల్యేల అభ్యర్థన మేరకు సెషన్ ప్రారంభంలో క్వశ్చన్ అవర్, జీరో అవర్ చేపట్టే పద్ధతికి విరుద్ధంగా గవర్నర్ ప్రసంగానికి అంతరాయం కలిగించిన అంశంపై చర్చకు స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వన్ అనుమతించారు. చర్చ ప్రారంభించే ముందు సీఎం మాన్ స్పీకర్ చేతికి తాళం, దాని చెవి ఉన్న కవర్ ఇచ్చారు. చర్చ సమయంలో ప్రతిపక్ష సభ్యుల సభను వీడి బయటకు వెళ్లకుండా సభ తలుపులు వేసి తాళం వేయాలని కోరారు. తాను నిజాలు మాట్లాడుతానని, దీన్ని ప్రతిపక్షాలు సహించవని, వారు పారిపోకుండా ఉండేందుకు తాళం వేయాల్సిందిగా స్పీకర్‌కు సూచించారు. అయితే తామేమీ సభ వదిలివెళ్లమని కాంగ్రెస్ సభ్యుడు పర్తాప్ సింగ్ బజ్వా సీఎం మాన్‌తో చెప్పారు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చెలరేగింది. బజ్వా, మాన్‌లు వాదనకు దిగటంతో సభలో చర్చ జరిగేలా సభ తలుపులకు తాళం వేయటం లాంఛనమని స్పీకర్ తెలిపారు. ఓ దశలో పరిస్థితి అదుపు తప్పటంతో స్పీకర్ సభను 15 నిమిషాలు వాయిదా వేశారు. సభ వాయిదా పడ్డాక కూడా బజ్వా కొన్ని వ్యాఖ్యలు చేశారు. దీంతో అధికార ఆప్ సభ్యులు ప్రతిపక్షాల బెంచ్‌ల వైపు దూసుకెళ్లి వాదనకు దిగారు. ఇరు పార్టీలకు చెందిన కొంత మంది ఎమ్మెల్యేలు పరిస్థితిని సద్దుమణిగించటానికి ప్రయత్నించినప్పటికీ కాంగ్రెస్, ఆప్ సభ్యుల మధ్య వాగ్వాదం కొనసాగింది. మార్చి 1న బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన ప్రసంగాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు అడ్డుకున్నారు. రైతుల ఆందోళనలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. గట్టిగా నినాదాలు చేశారు. దీంతో గవర్నర్ తన ప్రసంగాన్ని మధ్యలోనే నిలిపేశారు.



భగవంత్ మాన్

## మోయలేని భారంగా విద్య: బాంబే హైకోర్టు

ముంబై: భారతీయ సంస్కృతిలో విద్యను పవిత్రమైనదిగా, దైవ సంబంధమైనదిగా పరిగణిస్తామని, అయితే నేడు అది భరించలేనిదిగా మారిందని బాంబే హైకోర్టు వ్యాఖ్యానించింది. నాణ్యమైన విద్యను ప్రతి ఒక్కరికీ చేరువ చేయడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పింది. పుణేలో విద్యా సంస్థలను ఏర్పాటు చేసేందుకు రెండు ఆర్గనైజేషన్లకు మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను రద్దు చేయడానికి తిరస్కరించింది. సంబంధం లేని కారణాలతో తమ దరఖాస్తులను రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించిందని జాగృతి ఫౌండేషన్, సంజయ్ మోదక్ ఎడ్యుకేషన్ సొసైటీ పిటిషన్లను దాఖలు చేశాయి. హైకోర్టు ఫిబ్రవరి 21న తీర్పు చెప్తూ, విద్యా సంస్థను ఏర్పాటు చేయడం కోసం భూమి స్వభావం, ఆర్థిక వనరుల లభ్యత, మౌలిక సదుపాయాలు వంటివాటిని పరిశీలించవలసి ఉంటుందని తెలిపింది. దరఖాస్తులను రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించడం నిరంకుశత్వం, అన్యాయం అని చెప్పలేమని వివరించింది.

# పెరిగిన ఆస్ట్రేలియా వీసా తిరస్కరణలు

- **పలు వర్సిటీలు అడ్మిషన్ల ఆఫర్‌ను తిరస్కరించడమే కారణం!**
- **భారతీయ విద్యార్థుల ఆందోళన**

న్యూఢిల్లీ: ఇటీవల ఆస్ట్రేలియా వీసా దరఖాస్తులు భారీగా తిరస్కరణకు గురవుతున్న నేపథ్యంలో భారతీయ విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పలు యూనివర్సిటీలు విద్యార్థుల అడ్మిషన్ల ఆఫర్‌లను ఉపసంహరించుకొంటున్న కారణంగా వీసాల తిరస్కరణ పెరిగిందని స్థానిక మీడియా నివేదికలు చెబుతున్నాయి. దరఖాస్తు సరిగా లేదన్న కారణంతో యూనివర్సిటీ ఆఫ్ వొలోంగాంగ్, లా ట్రోబ్ యూనివర్సిటీలు పలువురు విద్యార్థులకు ఆఫర్‌లను ఉపసంహరించాయని టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ పేర్కొన్నది. అయితే ఈ ఆరోపణలను ఆ రెండు వర్సిటీలు ఖండించాయి.



### తగ్గనున్న విదేశీ విద్యార్థుల సంఖ్య

ఓ వైపు విద్యార్థుల దరఖాస్తులను తాము తిరస్కరించడం లేదని ఆస్ట్రేలియా యూనివర్సిటీలు చెబుతున్నాయి. అయితే ఇటీవలి స్టడీ వీసా దరఖాస్తుల విషయంలో ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నదని విదేశీ విద్యా నిపుణులు అంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్ట్రేలియాలో మొత్తం విదేశీ విద్యార్థుల సంఖ్య 3,75,000కు తగ్గుతుందని, తర్వాతి ఏడాదికి రెండున్నర లక్షలకు పడిపోతుందనే అంచనాలు ఉన్నాయని ఇన్‌ఫైనెట్ గ్రూపు సీఈవో గౌరవ్ బాత్రా అన్నారు. ఈ వీసా దరఖాస్తుల తిరస్కరణల ప్రభావం, ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రవేశపెట్టిన కఠిన నిబంధనలను గమనించదగినవని పేర్కొన్నారు. అధికారులు సరైన సమాచారం ఇవ్వకుండా చాలా దరఖాస్తులను తిరస్కరించారని, ఇది ఉన్నత విద్య కోసం ఆస్ట్రేలియా రావాలనుకొంటున్న విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అభిప్రాయపడ్డారు. తాజా పరిణామాల నేపథ్యంలో పలువురు విద్యార్థులు న్యూజిలాండ్, ఇతర దేశాల వైపు చూస్తున్నారు. తప్పుడు పత్రాలు సమర్పించడం వంటివి వీసా తిరస్కరణకు కారణాలుగా ఉండొచ్చని ఈఎస్ఎస్ గ్లోబల్ డైరెక్టర్ రోహిత్ సేథి చెబుతున్నారు.

## రాజ్యసభకు నడ్డా రాజీనామా

న్యూఢిల్లీ, మార్చి 4: బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా సోమవారం రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. హిమాచల్ ప్రదేశ్ నుంచి నడ్డా రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన పదవీ కాలం మరి కొన్ని రోజుల్లో ముగియనున్నది. ఈలోగా గుజరాత్ నుంచి మరోసారి రాజ్యసభకు నడ్డా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో హిమాచల్ ప్రదేశ్ తరఫున ఎంపికైన స్థానానికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను రాజ్యసభ చైర్మన్ ఆమోదించారు.



## కేంద్ర నిధుల్ని కాజేసిన సల్మాన్ ఖుర్షిద్ భార్య!

న్యూఢిల్లీ, మార్చి 4: కాంగ్రెస్ ముఖ్య నేత సల్మాన్ ఖుర్షిద్ భార్య లూయిస్ ఖుర్షిద్.. కేంద్ర ప్రభుత్వ నిధుల్ని కాజేశారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపించింది. కేంద్ర నిధులు రూ.71.50 లక్షలను లూయిస్ ఖుర్షిద్, మరో ఇద్దరు అక్రమంగా దారిమళ్లించి, మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఈడీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ కేసులో మనీలాండరింగ్ చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఉత్తరప్రదేశ్‌లోని ఫరూఖాబాద్ జిల్లాలో 15 వ్యవసాయ భూముల్ని, డాక్టర్ జాకిర్ హుస్సేన్ మెమోరియల్ ట్రస్ట్‌కు చెందిన రూ.45.92 లక్షల బ్యాంక్ డిపాజిట్లను అటాచ్ చేసినట్టు ఈడీ పేర్కొన్నది.



## తృణమూల్ ఎమ్మెల్యే తపస్ రాయ్ రాజీనామా

కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికల వేళ తృణమూల్ సీనియర్ నేత, పశ్చిమ బెంగాల్ శాసనసభలో ఆ పార్టీ డిప్యూటీ చీఫ్ విప్ తపస్‌రాయ్ ఎమ్మెల్యే పదవికి సోమవారం రాజీనామా చేశారు. పార్టీతోపాటు సీఎం మమతాబెనర్జీ తీరు తనను బాధించిందని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన.. రాజీనామా లేఖను స్పీకర్‌కు సమర్పించారు. అంతకుముందు ఆయనను బుజ్జగించేందుకు పార్టీ నేతలు బ్రాత్య బసు, కుణాల్ ఘోష్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తనపై ఈడీ దాడులు జరిపినా ముఖ్యమంత్రి కనీసం పలకరించలేదని తపస్ రాయ్ పేర్కొన్నారు. తపస్‌రాయ్ బీజేపీలో చేరనున్నారని ప్రచారం జరుగుతున్నది.

# మోదీ ఫొటోతో ఆహార ధాన్యాల సంచులు!

- **కొనుగోలుకు 15 కోట్లు ఖర్చు చేస్తున్న ఎఫ్‌సీఐ**
- **లోక్‌సభ ఎన్నికల ముంగిట నిర్ణయం**

న్యూఢిల్లీ, మార్చి 4: లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన(పీఎంజీకేఏవై) స్కీమ్ కింద ఇస్తున్న ఆహార ధాన్యాలను ప్రధాని మోదీ ఫొటోతో కూడిన ప్రత్యేక బ్యాగుల్లో పంపిణీ చేయనున్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.15 కోట్ల మేర ఖర్చు చేస్తున్నదని ది హిందూ నివేదించింది. ఆర్టీఐ కార్యకర్త అజయ్ బోసు దరఖాస్తులకు అందిన సమాధానాల ప్రకారం.. ప్రధాని మోదీ ఫొటో లోగోతో కూడిన లామినేటెడ్ బ్యాగుల కొనుగోలు కోసం రాజస్థాన్, సిక్కిం, మిజోరం, త్రిపుర, మేఘాలయ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) ప్రాంతీయ కార్యాలయాలు టెండర్లను ఖరారు చేశాయి. అదేవిధంగా పశ్చిమబెంగాల్ రీజియన్‌కు సంబంధించి బ్యాగుల కొనుగోలు కోసం కంపెనీ ఎంపిక ప్రక్రియ జరుగుతున్నదని ఆర్టీఐ సమాధానం ద్వారా తెలిసిందని హిందూ కథనం పేర్కొన్నది. ఆర్టీఐ సమాధానాల ప్రకారం.. 1.07 కోట్ల సింథటిక్ బ్యాగుల కోసం రాజస్థాన్ ఎఫ్‌సీఐ కార్యాలయం రూ.13.29 కోట్లు ఖర్చు చేస్తున్నది. 5.98 లక్షల మోదీ బ్రాండెడ్ బ్యాగుల కోసం త్రిపురలో రూ.85.51 లక్షలు, 4.22 లక్షల బ్యాగుల కోసం మేఘాలయలో రూ.52.75 లక్షలు, మిజోరంలో 1.75 లక్షల బ్యాగుల కోసం రూ.25 లక్షలు ఆయా రాష్ట్రాల్లోని ఎఫ్‌సీఐ ప్రాంతీయ కార్యాలయాలు ఖర్చు చేస్తున్నాయి. సిక్కింలో ఈ ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నది. దాదాపు 98 వేల బ్యాగులను కొనుగోలు చేసేందుకు ఈ ఈశాన్య రాష్ట్రంలో బ్యాగుకు రూ.14.65 చొప్పున రూ.14.35 లక్షలు వ్యయం చేయనున్నట్టు ది హిందూ తెలిపింది. బ్యాగు చొప్పున ధర ఈ ఐదు రాష్ట్రాల్లో వేర్వేరుగా ఉండటం గమనార్హం. ఆహార ధాన్యాల పంపిణీ కోసం మోదీ లోగోతో కూడిన నేసిన లామినేటెడ్ బ్యాగుల కొనుగోలుకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని ఎఫ్‌సీఐ తన అన్ని 26 రీజనల్ కార్యాలయాలను ఆదేశించిందని ది హిందూ అంతకు ముందు కథనంలో పేర్కొన్నది.





## యాపిల్‌కు 16,500 కోట్ల జరిమానా

లండన్: పోటీ చట్టాలను అతిక్రమించి సొంత మ్యూజిక్ సర్వీసులకు అనుచిత లబ్ధి చేకూర్చేలా వ్యవహరించిన కేసులో టెక్ దిగ్గజం యాపిల్ కంపెనీకి యూరోపియన్ యూనియన్(ఈయూ) సోమవారం రూ.16,500 కోట్ల భారీ జరిమానను విధించింది. తమ యాప్ బయట ప్రత్యామ్నాయ, చౌకైన సంగీత చందా సేవల గురించి ఐఓఎస్ యూజర్లకు యాప్ డెవలపర్లు సమాచారం అందించడాన్ని యాపిల్ పూర్తిగా నిషేధించిందని ఈయూ ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఇది చట్ట విరుద్ధం. లక్షలాది యూరోపియన్ వినియోగదారులపై ఇది ప్రభావం చూపించింది' అని ఈయూ కాంపిటీషన్ కమిషనర్ వ్యాఖ్యానించారు.